కథ

# బొందలగడ్డ

చింతకింది శివశంకర్
99123 24492

“భామా సుందరాలో వెన్నెల..
బంగారు కుందనాలో వెన్నెల..
నిన్నుసూస్తే నా మనసు..
వెన్నెలోవెన్నెల!
నిలవజాలకున్నాదే.. వెన్నెలోవెన్నెల!
అమ్మో నీ అందాలకి.. వెన్నెలోవెన్నెల!
నాకు దిమ్మతిరిగి పోతుందే.. వెన్నెలోవెన్నెల!''..

అంటూ దేవయ్య పాట పాడుతుంటే.. కోలాటం కట్టెల చప్పుడు, గజ్జెల చప్పుడుకంటే వాని గొంతే ఎక్కువ వినిపిస్తున్నది. దేవయ్యకు తెలిసినవి రెండే.. ఒకటి కోలాటం, ఇంకోటి తప్పెట కొట్టడం.

సమర్త కాణ్నించి, పెండ్లి, చావు ఇట్లా ఏ కార్యమైనా.. దేవయ్య తప్పెట మోగాల్సిందే! తెల్లారితే బోనాల పండుగ. ఆ ఊళ్లె పెద్ద పండుగ అదే. పట్నమని, దేశమని బతకనికే వలస పోయినోళ్లందరు వస్తరు. వాళ్లను చూస్తే దేవయ్య నోరు ఆగదు, కాలు నిల్వదు. పదం వెంట పదం పాడుతడు, ఉద్ది వెనుక ఉద్ది వేస్తడు. ఏ మధ్యరాత్రో చల్లటి చెమటలతోటి గుడిశెకు పోతడు. ఆ గుడిశె, ఆ ఊరి బొందలగడ్డకు ఆనుకొని ఉంటది. ఎప్పుడెప్పుడు ఆ గుడిశెను ఆక్రమించుకుందామా!? అని బొందలగడ్డ నోరెళ్లబెట్టుకొని చూస్తుంటది.

దేవయ్య గుడిశెకు పోయి, కాళ్లుచేతులు కడుక్కొని, గాఢనిద్రలో ఉన్న పెండ్లం – పిలగాని పక్కన పండుకుండు. పెండ్లం పద్మ, ఆరేండ్ల కొడుకు బాల్ చెంద్రి.

పద్మ పొద్దుగాల లేచి, ఓ కోడిని పట్టుకొని కట్టేసి.. వాకిలి ఊడ్చి, సాంపి చల్లి, బువ్వతొక్కు వండి, పిలగానికి తానం చేపిచ్చింది. మొగుడు తానం చేస్తుంటే ఈపు రాసింది. అందరూ కొత్త బట్టలేసుకున్నారు. పటేల్‌ను కలవనీకె పోయిండు దేవయ్య. పద్మ.. కొడుకుతోపాటు కుమ్మరోళ్ల ఇంటికివోయి, ఓ బోనం కుండ, చిన్న గురిగి కొనుక్కున్నరు. పద్మ బోనంకుండ, కొడుకు గురిగి పట్టుకొని గుడిశెకు వచ్చిండ్రు.

పద్మ కొత్తకుండను కడుగుతుంటే, పిలగానికి కట్టేసిన కోడి కనిపించింది.

“అమ్మా.. కోడినెందుకు కట్టేసిండ్రు''.

“పోషమ్మ కాడ కోసుకోనికె''.

“ఇయ్యాల మన ఇంట్ల చియ్యల కూరనా!? అయితే నాకు పొలావ్ బువ్వ కావాలి. నాకంటా.. పొలావ్ బువ్వా.. కావాలీ..'' అని దీర్ఘాలు తీస్తూ పాడుతుండు. పద్మకు నగొచ్చింది.

“చియ్యలు, పొలావ్ బువ్వ ఇయ్యాల కాదు.. రేపు!'' అన్నది తల్లి.

“రేపైతె మల్ల కోడిని ఇయ్యాల ఎందుకు కట్టేసిండ్రు. నేను పోయి ఇప్పుతా!''.

“ఏయ్.. కోడికాడికోతే దెబ్బలు పడ్తయ్!''..

కొంచెం కోపంగా అంటూ, కుండ కడుక్కొని గుడిశెలకు పోయింది పద్మ. పిలగాడు అలిగి, పద్మ వెనుకనే మెల్లగా పోయిండు. పద్మ మూడు దోసిళ్ల బియ్యం చేటల పోసుకుని చెరుగుతున్నది. పిలగాడు పద్మ దగ్గరికివోయి గదువ పట్టుకొని..

“అమ్మా! చియ్యలు రేపు చేసుకుందాం. ఇయాల పొలావ్ బువ్వ చెయ్యే!''.

పిలగాని కండ్లకేసి చూసింది పద్మ. వానికి పొలావ్ అంటే పానమని తెలుసు. వాడట్లా అడిగేసరికి పానమంత రోట్లేసి దంచినట్టయ్యింది. సర్రున కన్నీరు వచ్చి కంటిపార అవుతల ఆగింది. వాడు ఎప్పుడు ఏది అడిగినా కాదనకుండా చేసి పెట్టింది. బియ్యం చేట పక్కకు పెట్టి, పిలగాణ్ని దగ్గరికి తీసుకుని..

“అది కాదయ్యా! ఇయ్యాల బోనాల పండుగ కదా, పోషమ్మకు నైద్యం పెట్టాలి. అందుకే ఇయ్యాల పొలావ్ బువ్వ, చియ్యల కూర చేయకూడదు. రేపు సద్దిపండుగ, రేపు చేసుకుందం!'' అన్నది.

పిలగాడు అలిగి తల్లివైపు అట్లనే సూస్తుండు.

“ఇప్పుడు బెల్లం బువ్వ చేసుకుందం!''..

గా మాట ఇనంగనే.. పిలగాని ముఖం కొంచెం ఎలిగింది.

“నీకు బెల్లం బువ్వ అంటే ఇష్టమే గద!?''.

“ఇష్టమే! కానీ, పొలావ్ బువ్వంటే ఇంకా శానా ఇష్టం'' అని చేతులు వెడల్పు చేసి చూపిచ్చిండు.

ఇద్దరి ముఖాల్లో నగొచ్చింది.

పద్మ చేటల మెరికెలు ఏరుతున్నది. పిలగాడు తలకాయ కిందికేసుకుని అంగీ పైగుండి కాడ చేతితో సుడులు తిప్పుతూ, కుడికాలు గోరుతో నేల గీకుతూ..

“అమ్మా!'' అనంగానే పిలగాణ్ని చూసింది పద్మ.

“అమ్మా.. మల్ల పోషమ్మ కాడికి, కోడ్ని నేను పట్టుకొస్తనే!'' అన్నడు.

పద్మ నగుమొకంతో.. ‘సరే!’ అన్నది.

పిలగాని మొఖం చందమామలాగ వెలిగిపోయింది.

పిలగాడు పద్మ వెనుకజేరి మెడ చుట్టూ చేతులేసి ఊగుతున్నడు. ఇంతలో..

“పద్మా..'' అనుకుంటూ దేవయ్య వచ్చిండు.

పిలగాడు ఎదురు ఉరికి..

“అయ్యా! ఇయాల పోషమ్మకాడికి కోడ్ని నేనే పట్టుకొస్తున్న.. అమ్మ చెప్పింది'' అని చెప్పిండు.

“సరే.. ఇంత బువ్వ ఏస్కరాపో'' అన్నడు దేవయ్య.

పద్మ ఏసిచ్చిన బువ్వ తీసుకుపోయి ఇచ్చిండు. దేవయ్య తినుకుంటూ, మధ్యలో పిలగానికి కూడా తినిపిస్తుండు. వాడు ఇంతసేపు జరిగిందంత తండ్రితోని చెప్తున్నడు..

“ఇయాల మన ఇంట్ల బెల్లం బువ్వ, రేపు చియ్యలకూర పొలావ్ బువ్వ!'' అని.

పద్మ కుండలో బియ్యం పోసి, పొయ్యి మీద పెట్టింది. బెల్లం దంచుతూ, పిలగాడు చెప్పే జోలి వింటూ ముసిముసిగా

